నీలమణి

ఇన్నాళ్ళకు-ఈవాళ ఉదయం అటు సూర్యుడు ఇటు పొడిచాడు :

ఇలా జరిగిందని నీవూ నేనూ, ఆశ్చర్యపడుతున్నామా ? విస్తుపోయి చూస్తున్నామా? నహి!-ఒట్టుకోసం వాడుకునే పాతప్రయోగం ఒక్కసారి, ఎందుకో నిజమైనప్పుడు—మన ఆదమరపు పెట్టే బాధకు దరీ అంతూ అంటూ ఉండదు.

వెంకటపతి—ఈ బాధంతా—జాలితో అర్థంచేసుకున్నాడు: దైవం ఎట్టకేలకు మనమీద దయదలచాడు!

అసలు అంతే కద- నీవూ నేనూ — మనమందరం మంచి గృహస్థులం : చొక్కా, పంచా గట్టిగా మాపుతేలకముందే—మడతలు మార్చుకునేందుకు నోచుకున్న

వాళ్ళం: కాఫీహోటలులోకి ధీమాగా, రొమ్ము విరుచుకుని, జైత్రయాత్రకు వేసే అంగలతో ప్రవేశించి, కమ్మగాతిని, గర్రున తేన్చి— ఖంగున రూపాయి తీసి, బల్ల ముందు వాడిమొగాన కొట్టి, యాదాలాభంగా, పెడమొగంతో, వాడు అందించిన చిల్లర, ఎడమచేతిలో వేయించుకుని, ఆ చెయ్యి చెయ్యా ఆపాళంగానే, గుమ్మం మొగదల కూర్చున్న కిల్లీ దుకాణదారుడి కళ్ళముందు విప్పి — కావలసిన సరంజామా - కను సైగతో విప్పిచెప్పి-అంది పుచ్చుకుని—కాలణా ధర్మంచేసి పోతామేమోనని; గంపెడు ఆశతో మన చుట్టూమూగే దిక్కుమాలిన వాళ్ళకు ఒక్క కటాక్ష వీక్షణం పారేసి .... ఇప్పుడు చిల్లరలేదని....ఖచ్చితంగా చెప్పి- అప్పటికీ పట్టి పల్లార్చేవాడిని అలవోకగా గద్దించి....ఇంకా విడవకుండా అనుగమించే వాడిని-హుంకరించి....హితబోధచేసి.... రాజెవరి కొడుకన్నట్టు....పురివిప్పి-నిలుచుంటాం! అలా నుంచోగలం !—

మన ముందర వెంకటపతి....ఏపాటి ? అసలు వాడు కూడా ఓ మనిషేనని, లోకం ఎందుకు అనుకుంటూందో, అనుమతిస్తూందో: మనకెవరికీ నిజానికి; అర్థం కావడంలేదు కాదూ?-ఇదే; ధర్మప్రభుత్వమై మనం మెసులుతూన్నదే; రవంతైనా సత్యయుగమైతే-వాడిని నాలుగు కాళ్ళమీద నడిపించవద్దూ?-

మనం పుట్టక ముందు నుంచీ....వెంకటపతి; పరమ దరిద్రుడు: కర్ణుడి సహజ కవచ కుండలాలల్లే; వీడు తల్లి గర్భంలోనుంచి....అలా చీలికలు వాలికలతోనే పుట్టి ఉండాలి: వాడిచొక్కా జేబుకన్న మరో వ్యర్థపదార్థం సృష్టిలో ఎక్కడన్నా ఉందా?- అతగాడికి అరచెయ్యే జేబు-నీవో నేనో ఈ పీడ వదిలించేందుకు .... నాడూ నేడూ పావో-పరకో రాలిస్తే-దాన్ని తక్షణం....వాడి ఏ యిడ్లీలోకో మరుక్షణంలో విని మయం చేసేస్తాడు...పొగ చేసేస్తాడు...

వాడు కనబడటం భయంకద, కంటపడితే-అడగకుండా మానడు కద.... బ్రతి కున్నన్నాళ్ళూ పరగడుపే!-ఎవడు అరుస్తాడు....ఎవడు తీరుస్తాడు—ఇలా అస్తమానం, వినూ్నా నన్నూ పట్టుకు వేధించకపోతే....ఏలేందుకంటే దేశాలు; ఎవడికీ ఈనాడు లేక పోతే పోవచ్చును కాని .... సప్తద్వీపాల్లో మహారాజులాగా ఎత్తుకు తినవచ్చునే — పోదేం ?

ఎలా బ్రతుకుతున్నాడు-మన అందరం దయతలచబట్టి? అంతే కద?....

మరి: ఎందుకు బ్రతుకుతున్నాడు.... తినేందుకు; తిండిలేక .... ఉండేందుకు

ఉనికిలేక....ఓ నాడన్నా; బట్టమార్చి బట్టకట్టుకునేందుకు .... మరో పంచా చొక్కా-అంటూ లేక—

ఏమో; నీకూ నాకూ అర్థంకాదు! "ఏం పంతులూ; ఇలా బ్రతకడంకన్న .... కాస్త ఓపికపట్టి....కళ్ళు మూసేసుకున్నావంటే- నీకు నీ బాధా తప్పుతుంది; మాకు నీ పీడా వదిలిపోతుంది...." అని లక్షలసార్లు మనం మనసులో విసుగుతో అనుకున్నామే కాని; ఒక్కసారన్నా నోరువిడిచి వాడితో అనలేకపోతున్నాం....అందుకు మన మంచితనమే....మన భూతదయే కారణం...కావడానికి ఏ మాత్రమూ సందేహం లేదు !...

ఏ విధానన్నా....ఒక్కరోజన్నా; వాడిని మరచిపోదామన్నా .... ఇవాళిటికి వెంకటపతి బెడద లేకుండా పోయింది...అని అనుకుందామన్నా - ఏదీ; ఆ సుదినం ఎంతటికీ రానిదే!...

వాడి బ్రతుకుమీద; మనకు విసుగేసిపోయింది కాని...వాడికి; ఏ మాత్రమూ ఆ యింగితం లేందే!....

*　　　*　　　*

నిన్నా మొన్నా....వెంకటపతి కనబడలేదు ....

....ఇప్పటికప్పుడే చూసి....వారం దాటుతూంది....

నీకూ కనబడటంలేదు....నాకూ కనబడటంలేదు—లేక ఏమైపోయినాడు....?

అఁ...ఏమైపోతాడు అంత హఠాత్తుగా ఉన్నట్టుండి?-

జబ్బు చేసిందా...?

జబ్బు అంటూ వాడికి ఇవాళ కొత్తగా చేయాలా? వాడిని చూస్తేనే ఎదుటివాడికి ఖాయిలా చేసే అంత రోతమారితనంలో యిన్నాళ్ళనుంచీ బ్రతకడంలా ?.... అలాటి వాళ్ళకు రోగం రొష్టూ యీ భయాలేం లేవు: ఎల్లకాలం ఉట్టికట్టుకు వూరేగుతారు! ...

అయినా...ఒకవేళ, దేహం శాశ్వతంకాదు గనుక రాలిపోయినాడేమో ?... పోతే పోనూ వచ్చు! అందులో మహా విడ్డూరం ఏముంది? ... ఎంతాకాలంలో టపటపా ఆగమ్మ కాకులూ ... గబ్బిలాలూ ఎన్ని రాలిపోవడంలా? ... అంతే యిదీనీ! ...

అంతేకాని...అలా కాదులే...ఎంత చచ్చుగా బ్రతికినా .... ”న్నన్నాళ్ళూ .... కొంచెం కుడి ఎడముగా: మనిషి క్రిందనే జమకట్టింది లోకం...కనుక రోడ్డుప్రక్కనో, సైడ్ కాలువలోనో, ఏ కుక్కో పిల్లో బిర్రబిగిసి పడివుంటే ... కాలుకు తాడుకట్టి ఈడ్చి అవతల పారేస్తాం ... అంతకన్న - దాని కులగోత్రా లేమిటా అంటూ అడగనుక్కోం!-మరి...మనిషన్న తరువాత అలా కాదే!...ఎంత దిక్కుమాలిన పోకపోయినా-బ్రతికి వుండగా-వాడిని మనం బ్రతికినవాడి క్రింద కట్టకపోయినా, తీరా ఓ ప్రాణి పోయింది అని ఖచ్చితంగా తేలినమీదట-మట్టి మట్టిలో కలిపే ముందు-ఆ జీవి వూరూ పేరూ ఎలాటివో-కొంత భోగట్టా తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తాం! ఎందుచేత నంటే—వాడు బ్రతికి ఉన్నన్నాళ్ళూ దయ్యం—చచ్చిన తరువాత మనలాటి మనిషే-అవునా?—

తెల్లవారి లేవగానే, పత్రిక తెరవడానికి భయం—ఏమో ఎక్కడన్నా ఆ వార్త కంట పడుతుందేమో? “ఫలానాచోట—ఆనవాలు తెలీని మొగకళేబరం—” అన్ని ఠాణాల్లోను దాని బొమ్మలుంటాయి— ఎవరన్నా చూసి గుర్తించేందుకు అవకాశం ఉంది!

ప్చ్!-ఎన్నాళ్ళు ఎదురు చూసినా, ఆ పోణెము లేకపోయె-వెంకటపతి ఇన్నాళ్లా కంటపడి వేపుకు తినేవాడు-ఇప్పుడు ఏమైనాడో తెలియకుండా— పీడిస్తున్నాడు! ఎలా, మనకు యీ బాధ వదిలేది?-ఏదో, ఓ చల్లని కబురు నికరంగా తెలిసేది? -

* * *

ఆవాళ, వెంకటపతి కనబడటమేమిటి: మన ప్రాణాలన్నీ ఈ మూలనుంచి ఆ మూలకు లేచి రావడమేమిటి?—

మళ్ళీ కళ్ళకు కనబడడు అనుకున్న ఘటం చూపులకు అందాడు అనే విస్మయం—విషాదం, రవంత భయం - మన కవళిక దానంతట అదే: అభినయించగలదు: కాని, ఏమని పలుకరించాలి?-ఎలా ప్రశ్నించాలి? —ప్రశ్నించామే బో-

“ఎప్పు డొచ్చావురా ?—”

“నేను—ఎక్కడికి వెళ్ళాను?—”

“మరి- యిన్నాళ్ళనుంచీ ఏం చేస్తున్నావ్-”

“మీ అందరూ చేసేదే-”

"అనగా-"

"బ్రతుకుతున్నాను-బట్ట కడుతున్నాను !—"

"అర్థం కావడంలేదు—"

"అయితే బ్రతకడం సుదుర్లభం-"

ఉహూ!-ఏమిటి వీడి వాలకం ?—వెర్రా ! తలబోగరా ?—ఏది, పరకాయించి చూడనీ—

అరె? వీడికి ఈ ఇస్త్రీ మడతలు ఎక్కడివి ?— అరెరె! వీడి చింకిరిజుట్టు;— క్రాపింగ్‌గా మార్చడానికి వీలుందా ?—ఇదేమిటి — వీడూ మనిషిలాగ తయారైనాడేం? ఇంచుమించు అచ్చంగా మనం ఉన్నట్టే వున్నాడేం ?—

ఇన్నాళ్ళకు తీరా ఇప్పుడు పుట్టిందేం వీడికి ఈ దుర్బుద్ధి ? ఏ మహారాజో, ఈ శని వదుల్చుకునేందుకు, ఒకటో రెండో మొగాన కొట్టాడనుకుందాం : అది పొదంగా ఉంచుకుని, ఏ పదిరోజుల పాటో కలో గంజో త్రాగకుండా ఎక్కడో యీ గుడ్డలు పడికెకు తెచ్చుకుని ఉంటాడు—అక్కడికి ఆ సింగారం చాలనట్టు, పనిలో పనిగా తల అంబట్టడికి దర్శించుకొని ఉంటాడు—ఇలా ఆ కాసూవీసమూ క్షౌరంచేసుకుని- మళ్ళీ యధాప్రకారం తయారు!

మునుపటికన్న తరహా మారిందాయెను — దానం మోతాదు కూడా; ఎక్కువ పడేస్తాడేమో? పరకో పాతికో, కాకుంటా; కరుకులు రాల్చమంటే—మనం ఇహ వీడిని తప్పించుకునేందుకు వూరు విడిచి పారిపోవాలి! అందుచేత; ముందు కాళ్ళకు బంధంగా వాడు అడగకముందే ఎరవేసి చూద్దాం! కొద్దిలో సర్దుకు పోతుంది:

"ఏంరా కాఫీ త్రాగుతావా:"

వీడు పుట్టి బుద్ధెరిగిన తరువాత, ఎవడన్నా, ఎన్నడన్నా యింత ఆప్యాయంగా ఆహ్వానించాడా?-ఎగిరి గంతేయవద్దూ !....

"ఉహుం. త్రాగను-"

-ఏమిటీ వింత....ఆ గుక్కెడు వేన్నీళ్ళు కొనుక్కునేందుకు వెధవ.... బేడ డబ్బులకోసం....ఉదయం రెండు ఘళ్ళు, సాయంత్రం రెండు ఘళ్ళు....కాళ్ళు బలపాలు కట్టేటట్టు తిరిగేవాడే....ఎవడు కనబడుతాడా అని, అడుగడుగునా కాపేసేవాడే....కనబడ్డవాడినల్లా దేవిరించేవాడే: అల్లాంటివాడు....వీడు....ఈ వెంకటపతి....

కాఫీ యిప్పిస్తానంటే, నదురూ బెదురూ లేకుండా అక్కర్లేదని, చెప్పేరోజు కూడా వచ్చిందీ అంటే....యిది, పచ్చికలి గాక మరేమిటి?....

"అదేమిటిరా....కాఫీ త్రాగక పోవడమేమిటీ ?....

"మానేశాను!...."

"మానేస్తే....మరి ఎల్లా?...."

"ఎల్లాగో అల్లాగే వెళ్ళబుచ్చుతున్నాను..."

"పాపం!"

అవును పాపం:...విసుక్కున్నా ననుకున్నా- ఎరుగున్న వాళ్ళం ... మొదటి నుంచీ వాడిస్థితి ఎరుగున్నవాళ్ళం మేము దయదలచాలి కాని, లోకానికేం?... సవాలక్ష యాచకుల్లో వీడొకడు:

"ఏంరా, అలా కాఫీనీళ్ళన్నా లేకుండా, మాడుతూ-కనబడకుండా మాయమైనా వేం?..."

"ఏం చేయను! రోజులు మారినయ్ !"

"మా రోజులు మారలేదు-ఎంత కాటకమైనా...నీకు కాఫీకి ఎన్నడన్నా కాసిని డబ్బులు యివ్వడానికి గతిమాలే స్థితికి రాములే! రా, రావోయ్ ! మొగమాట మెందుకూ!..."

చెయ్యి పుచ్చుకుని వాడిని బలవంతం చెయ్యాలని, ఎందుకో మనసైంది నాకు; వీడు లోపలికి, వచ్చే పోణెంలో లేడు అని అంతర్వాణి మనసు నికరంగా అభయం ఇస్తూంది: అందువల్ల అంత ధైర్యంగా పిలిచాను;

ఉహూ(!...వాడు రానన్నాడు !...

రాకపోతే నామీద ఒట్టు అందాం అనేంతవరకూ వచ్చాను గాని...తీరా నోరు జారిం తరువాత: నన్ను అనుగ్రహించడానికా అన్నట్టు వాడు వెంట వేంచేసి విరుచుకు తిన్నాడా అంటే...ఆనక పస్తాయించి లాభంలేదు:

మెత్తపడతాడేమోనని భయం వేసింది....అందుచేత - సరే పోన్లేరా; నీ యిష్టం!—అని నిష్టురం వేశాను:

వెంకటపతి తనలో తాను నవ్వుకున్నాడు-

"కాఫీ వద్దకపోతే మానె; ఒక్క సిగరెట్ తీసుకో!

వాడు పెదవి విరిచాడు....“అదీ జిలాయేరా అబ్బీ!....” అంటూ!

“ఆ!” అంతకుమించి మరో అక్షరం నాలో పెగిలిరాలేదు....

“మరే రా: నాన్నా-పెద్ద వాణ్ణవుతున్నానా ఆ రోజు కారోజు-! అస్తమానం కాఫీ సిగరెట్లూ పోసిపోసి!....యీ తిత్తీ-ఆ తిత్తీ, దెబ్బతినేట్టు వున్నాయి. కొంత కాలం వాటికి స్వస్తిచెప్పడం మంచి పని-యిదీ నాకు పుట్టిన బుద్ధి కాదనుకో-మొత్తానికి అలానే నాకూ తోచింది-అంచేత. ఏవో పళ్లూ, పాలూ, గ్లూకోజ్, ఓవల్టిన్-యిలా లఘువుగా పోనిస్తున్నాను!—

ఉఁ-పోయిరా? లోపలికి-ఆకలేస్తున్నట్టున్నావ్-” అంటూ, నన్ను గ్రుక్క-తిప్పుకోనీకుండా-నిదానంగా, నిర్లక్ష్యంగా నడిచి వెళ్ళిపోయినాడు-

-వాడు అన్న మాటలు నిజమేమో అన్నంత భయం వేసింది: గుండెలు ఎగిరెగిరి పడ్డాయి. తలా నొసలూ బిఱ్ఱబిగుసుకు పోయినాయి: ఒళ్ళంతా వూదర పెట్టింది.

కాని — కాని - ఇదొక తరహా పిచ్చేమో, యిలా పైత్యం ముమ్మరంగా ప్రకోపిస్తే - అన్నం నీళ్ళూ ముట్టకుండానే - ఆ హెచ్చు దిగేంతవరకూ వెఱ్ఱి బలంగానే ఉంటారు!-అంతే అయివుండాలి—వాడి చూపూ, విసురూ, ఆ మాట విరుపూ అంతా - ధోరణి అలాగే వుంది: నిజంగా ఇది పిచ్చే!—

అమ్మయ్య-ఇప్పటికి మనసు కుదుటపడ్డది-

-ధర్మదాతలం అందరం కూడబలుక్కున్నాం!-సులువుగా ఏకాభిప్రాయానికి వచ్చాం!-ఇక ఆనాటినుంచీ వాడి కోసం వేట ప్రారంభించాం! రోజూ ఓ గంటో అరగంటో వాడు తగిలితే, ఎంత బాగుండును!-వెఱ్ఱివాడి భరతం పట్టొచ్చు: వాగించి-ఆ ధోరణికి మనం ఆనందించవచ్చు!—ఇంతకాలం నుంచీ తప్పనిసరిగా, వినోదం వన్ను చెల్లగడుతూన్నందుకు ఫలం ఇహనుంచన్నా అనుభవించవద్దూ? - కాని ఎంత గాలించి చూచినా వెంకటపతి చిక్కందే!

వెఱ్ఱివాడు కనుక జనం విశేషంగా వుండే ప్రదేశాలన్నీ పరిహరించి-ఒంటరిగా ఎక్కడన్నా ఆత్మాను సంధానంలోపడి—మమ్మల్నీ తన్నూ మరిచిపోయినాడేమో అని మా నగర పరిసరాలైన సుందర నిర్జన ప్రదేశాలన్నీ వస్త్రఘాలితం చేశాం - కాని ఒక్క అణువైనా వాడి ఆచోకీ అందలేదు.

ఇక మరి ఎక్కడ వెదకం! ఎక్కడ వున్నాడని వెదకం! - ఈ అన్వేషణా వస్థనే - ఆదుర్దానే, వైష్ణవులు, వాళ్ళ పరిభాషలో ఏదో ముద్దుపేరున పిలుచుకుంటారు !

కాని మేం మట్టుకు వెర్రి ఎక్కేంత స్థితికి వచ్చి- అంతటితో మా అదృష్టం కొద్దీ తెప్పరిల్లి-ఇక వాడిప్రసక్తే తలపెట్టడం మానేశాం - జీవితానికి ఇద్దరిని వెంకటపతి మళ్ళీ మనకు తగలడం అనేది సంభవం కాకపోవచ్చునని మనసుకు సంభాళించుకున్నాం-కచ్చగా!-మాకూ వాడికీ; అంతవరకే ఋణమా?—

o o o

ఆవేళ, సూర్యోదయానంతరం-

హోటల్లో యథాస్థానంలో కూర్చుని ఇడ్డెన్లు కబళిస్తున్నాను:

యథాస్థానమంటే - నాకు ఎందుచేతనో ఆడవాళ్ళ బల్లదగ్గర చదికిల బడటం అలవాటైంది - అది మరీ వేకువ కనుక స్త్రీ జనం మేతకు తరలి రాదు-అందుచేతనే కాబోలు హోటలు ఆసాములు నన్ను అక్కడ కాదని మందలించకుండా చూసీ చూడనట్టు వూరుకుంటున్నారు - ఒకవేళ, ఏ ముగుద అయినా; రావడం అంటూ తటస్థించినా, నన్ను మీరిన వయసుదైతే నేను అక్కడ లేనట్టు సరసనే చతికిల బడుతుంది: మీరని పడుచైతే నిర్లక్ష్యంగా మెడ రిక్కించి మరో స్థావరం ఆశ్రయిస్తుంది.

ఇది అంతా కేవలం అప్రస్తుత ప్రశంస అనుకునేరు: కాదు -కథకు గంపెడంత సంబంధం వుంది కనుకనే.

- సరే; నేను అలా తలవంచుకు భుజిస్తున్నాను - ముగిసేలోపుగా - ఆవిడ వచ్చి నా ఎదురుగుండా కూర్చుంది; నేను అదిరిపాటున తలఎత్తి చూస్తే, పరకా యింపుగా చిరునవ్వు నవ్వింది-అతి మామూలుగా పలుకరించింది:-

“ఏమండీ!— మీ స్నేహితులు ఏరీ?”

-ఎవరా అన్నట్టు చూశాను....

“వెంకటతతిగారండీ! - సాధారణంగా ఈ వేళకు మీరందరూ ఇక్కడ కలుసుకుంటారటగా!-”

“ఏమో-కనబడలేదు!” అని వుక్కిరి బిక్కిరిగా అన్నాను....

ఆవిడ నవ్వుతూ....కాఫీ త్రాగివేస్తూ.... "వుంటానన్నారే....తప్పకుండా".... అని తనలో తాను అనుకుంటున్నట్టు బిగ్గరగా అనేసి....నా తాలూకు బిల్లుకూడా, కుర్ర వాడి చేతులోనుంచి కముచుకుని....నన్ను మందలింపుగా ఒక్కచూపు చూసి....విసురుగా వెళ్ళిపోయింది: నేను ఏమీ అనలేక లోలోపల కుతకుత లాడుతూ, తల వంచుకుని ఆవిడ వెనువెంటే బయటకి....నడచి వచ్చింది....వచ్చిందంటే....ఈ కాయం!....

ఆవిడ రోడ్డెక్కి....కారెక్కింది....కారు సాగిపోతూంటే నన్నుచూసి.... వెళుతున్నా నన్నట్టు అద్దం మాటౌతూ నవ్వింది ....

ఎందుకు నన్నిల్లా అకారణంగా పరాభవించింది?....

ఆవిడ ఎవరో....నే నెరుగున్నాను....మీరెరుగున్నారు. మన రాయళ్ళందరూ అడియాసగా కలలుకనే ఆంధ్ర సర్వస్వమంత గ్రంధసాంగురాలు....నాకూ ఆవిడకూ ఏమిటి పేచీ! కలనైనన్ మెలకువ వేళలనైన....ఎన్నడూ మా కత్తులు రాపాడ లేదే? ...

వెంకటపతి పేరెత్తింది; ఎందుకు?....అన్నీ మానుకుని, వీడు యిప్పుడు అక్కడ కొలువుకు కుదిరాడా?....అయితే మాత్రం వాడి కర్మం వాడిది....నన్ను కవ్వించవలసిన అగత్యం ఏమిటి?....వాడు కనబడితే....నిలవెయ్యనూ?....

మనసులో అనుకుంటూండగానే అడుగో, వాడూ ప్రత్యక్షమైనాడు!....కనీ కనబడటంతోనే....ఏమిటిరా భడవా! ఈ ఆగడం? ....అంటూ సూత్రప్రాయంగా ఎత్తుకుని దులిపి వదిలి పెట్టాను. వాళ్ళిద్దరినీ కలిపి .... నా నోటికి వచ్చినట్టల్లా అన్నాను: వాడు మళ్ళీ జన్మజన్మలకు తల ఎత్తుకునేందుకు వీలులేకుండా గదిమాను;

అన్ని దులుపులూ దులపనిచ్చి - వాడు వీసం అన్నా తొణకకుండా అంటాడు కదా—"ఏంరా భాయ్!-ఎందుకింత తామసం నీకు? మనలో మనకు ఎలాటి అరమరికలూ లేవుకదా?-నా బిల్లు ఎన్ని లక్షలసార్లు, నీవు పుచ్చుకున్నావ్?-నేనేమన్నా గింజుకున్నానా?ఆవిడ తీసుకుంటే-"

"ఆవిడ అంతరమేమిటి-నా అంతరమేమిటి?-" అని మాట తెగేశాను.

"ఏమీలేదు- మీ యిద్దరూ నాకు ఒకటే-"

ఆ మాట నాకు కమ్చీ తగిలినట్టు తగిలింది- అది కనిపెట్టి వాడు భుజంమీద

చేయివేసి, సర్దిచెప్పాడు- "అన్నట్టు మేమిద్దరం పెళ్ళిచేసుకున్నట్టు-నీకు చెప్పలేదు కదూ?-" నేను వెనువెంటనే నిర్ఘాంతపోయినాను.

"నిన్నా?- ఏం చూసి చేసుకుందిరా?—" నా మనశ్శాంతి కోసం పగలబడి నవ్వాను-

"నేను ఆ ప్రశ్న అడగలేదురా భాయీ!- చేసుకుంటానంది- సరే నీ యిష్టం అన్నాను - నేను ఆ యింటివాణ్ణయినాను - "

—ఇదంతా గట్టి బుకాయింపేనని నా నమ్మకం—కాని, నిజమేనేమోనని, ఏదో బిక్కు బిక్కుగా వుంది—నిజమే అయినా, నేను నమ్మ తలచుకోలేదు -

"రేపు సాయంకాలం టీకి రావోయ్-" అని వెన్ను ఛళ్ళుమని చరచి వెంకటపతి మహా పని వున్నవాడిలాగా వెళ్ళిపోయినాడు-

ఉత్తర క్షణంలో యీ కబురు కార్చిచ్చులాగ వూళ్ళో అంటుకున్నది - నేనే అంటించాను-ఎవడు చూసినా నమ్మననేవాడే-విడ్డూరంగా మరొకడికి యీ విషయం చిలవలు పలవలుగా వివరించేవాడే !-

ఎవడికి వాడు—యీ హంశంలో వున్న కిటుకేమిటో తేల్చుకునేందుకు వూహాగానం ప్రారంభించాడు-కాని, ఎన్నివిధాల ఉల్టాసీదా చేసి చూసినా చిక్కు చిక్కుగానే వుంది-

ఆవిడి కేమన్నా పిచ్చి ఎక్కిందా?—అసంభవం!-

ఏం తక్కువని ఈ ఏబ్రాసిని కట్టుకుంది? - ఇంత కాలం నుంచి, దేశం ఏలుతూందే?-

సరే వాళ్ళ యింటికి వెళ్ళి చూస్తే - ఈ భాగోతమేమిటో అర్థమవుతుందిగా !....

—వెంకటపతి కారు పంపించాడు: టీకి వెళ్ళాను...ఇంటి నౌకర్లందరూ, వాడిని అయ్యగారంటూ అతి గౌరవంగా చూస్తున్నారు: ఆవిడ...టీకు...టాకు ఏమీ లేకుండా, అతి అమాయకపు ముత్తయిదువల్లే....ముసిముసి నవ్వుతూ, పది ఆడిగితే ఒక్కటి అతి అముక్తసరిగా సమాధానం చెపుతూ- మగడంటే ఎంతో అణకువతో,

వినయ విధేయతలతో...మెలగింది...వెంకటపతి కూడా...ఏమీ ఎబ్బెట్టు లేకుండా...ఎంత కాలంనుంచో కాపురం చేస్తున్న సరిపాత...గృహస్థల్లే...పుటకతోనే ఇంత ఐశ్వర్యం, ఇంత ఠీవి అలవాటైన వాడల్లే అనిపించాడు..ఎవరూ అంతు చిక్కనీయలేదు—

చివరికి, ఇక మనస్సు పట్టలేక..తెగించి,ఆవిడను అడిగాను...నవ్వి వూరుకుంది..ఆ నవ్వు సాంతం వినడానికి నాకు భయం వేసింది...ఇంకా అక్కడ ఒక్క నిమిషం వుండలేక వచ్చేశాను—

...వెంకటపతీ, ఆవిడా కనపడతారేమోనని...కొన్నాళ్ళు వీధులోకి రావడం మానేశాను...

...నేనే కాదు, మా వృతులందరికీ...ఇదే గ్రహచారం!...అందరం పోగై, మనస్సులో...మనస్సులో పిసుక్కునే వాళ్ళం..అవిడ దురదృష్టానికి ఆప్యాయనంగా వాపోయే వాళ్ళం...ఈ దాంపత్యం, మూడునాళ్ళ పట్టపగలే కాని...నిలవబోయిందా అని వూరడిల్లేవాళ్ళం...

...ఆ శుభ ముహూర్తం కోసమే, నిమిషాలు యుగాలుగా పరిగణించుకుంటూ గడిపాము—కాని రోజులు గడుస్తున్నాయే కాని...వాడి రేఖ మారందే!...

ఎక్కడ చూద్దామన్నా...వాళ్ళిద్దరే ప్రత్యక్షం...చిలకా గోరింకలకన్నా వుండదు అంత అన్యోన్యం...ఇదంతా ఆ వెర్రి బాగులది తెచ్చి పెట్టుకున్న మోజు...వాడి గ్రహబలం—

వాళ్ళను చూద్దామంటే చచ్చిన చావుగా ఉంటూంది....ఆగర్భ శ్రీమంతుడల్లే....డబ్బు కాళ్ళా చేతులా విరజిమ్ముతాడు....మొన్నపుటుకు మొన్న మా మనుమరాలిని బుజ్జగించడానికి అలా షికారుగా సముద్రం ఒడ్డుకు వెళదును కదా....అక్కడ వీళ్ళు తయారు!....చూసీ చూడటంతోనే పిల్లదాన్ని ఆవిడ చంకను వేసుకుంది....వెంకటపతి నన్ను నెత్తి నెక్కించుకున్నంత హంగామా చేశాడు: ఓ పట్టాన క్రిందికి దించందే!—

పిల్లదాన్ని బులిబుచ్చికం చేసి; అవీ యివీ కొనిపెట్టి యిట్టె నిమిషంలో మప్పకుంది....అది ఆవిడ కంఠానికి చుట్టుకుని దిగనంటుందే....చివరకు ఓ ప్రొద్దువేళకు

కారులో ఎక్కించుకుని, నాలుగు బజార్లూ తిప్పి, కనిపించిన బొమ్మా....బోటిగా అల్లా కొనిపెడుతూ పేటుడు సామానుతో, మమ్మల్ని ఇంటి దగ్గర దిగవిడిచి చక్కాపోయినారు....నేనేమో దుబారాగా దుకాణాలన్నీ కొనుక్కు వచ్చానని....పిల్లదాని ముత్తవతల్లి ....యిల్లుతీసి పందిరివేసినంత పనిచేసింది: అదంతా మన ప్రయోజకత్వం కాదు....సంభావన వచ్చిన బాపతు అని చెప్పి....పిల్లదానిచేత సాక్ష్యం చెప్పించి ఎలాగో మాట దక్కించుకున్నాను....ఆ పూటకు.

ఇవొక్కటే కాదు—వాళ్ళు కంట పడ్డారా అంటే, ఇలాగే దిన దిన గండం —

నన్నొక్కడినే కాదు-కనబడ్డ స్నేహితుణ్ణల్లా వెంకటపతీ, ఆవిడా కలిసి యిలాగే వంచన చేయడం సాగించారు; సిరి అంతా మా ముందు వలకబోసేవారు-కసి తీర్చుకుంటున్నట్టు! అందరం శతవిధాల - వాడి మర్యాదకు అందకుండా తప్పించుకునేందుకు యత్నం చేసేవాళ్ళమే, కాని-ఎప్పుడో ఒకప్పుడు చిక్కుతూనే వచ్చాం-ఈ నాటకానికి అంతు ఎన్నటికో తెలియలేదు-

అయితే, ఎల్లకాలం యిల్లాగే ఉండవచ్చారా - ఎప్పటికో అప్పటికి ఆవిడ తెప్పరిల్లి చేసిన తెలివితక్కువ పనికి రోసి, వీడిని తన్ని తగిలెయ్యదా - అనే మా ధైర్యం...

దైవం మమ్మల్ని చల్లగా చూడబట్టి- చివరకు అలాగే జరిగింది - ఒకనాడు ప్రాతఃకాలంలో, వెంకటపతి మా కన్నుల పండువగా మామూలు చింకిరితనపు పోడిమితో సాక్షాత్కరించాడు-చూసీ చూడగానే, ఏనుగు నెక్కినంత సంతోషం వచ్చి-

"ఏంరా! ఇలా ఉన్నావేం ?" అని మా గొంతులన్నీ ఏకంగా ప్రశ్నించాయి !-

వెంకటపతి, ఎంతో జాలి పడుతూన్నట్టు...."మీ కోసమేరా!" అన్నాడు !

ఎవడికి వాడికే ఆ జవాబులో ఏదో మెలిక, పెంకెతనం ఉన్నట్టే అనిపించింది కాని, సరిగా అర్థం కాలేదు-

"అంటే-"

"మామూలుగానే వున్నాను!" మేమేమో ఇన్నాళ్ళూ పీడకలలు కన్నట్టూ... దానేమి ఎరగనట్టూ...ఆ గొంతు!

"మరి, ఇన్నాళ్ళనుంచీ ఏలుతూన్న రాజ్యం-ఏమైందిరా"

"రాజ్యం చల్లగానే ఉంది...కాని, రాజుమాత్రం, ప్రజల యోగక్షేమ నిమిత్తం గద్దె దిగి, మళ్ళీ కాలినడకలోకి వచ్చాడు-" వాడి మాటలో చక్రవర్తి ఠీవి వుంది- వాడి మాటలో- మేము అంతకుముందు ఒరుసుకోని వాడి తేలుతూంది-

"మీ కోసమేరా - మీ అందరి కోసమేరా - నేను మళ్ళీ యీ స్థితికి వచ్చాను !- నా ఒక్కడి సుఖం చూసుకుంటే - మీ అందరూ మంచం ఎక్కేట్టు న్నారు-

ఇన్నాళ్ళనుంచీ, కానీ కోసం మిమ్మల్ని దేవిరిస్తూ, మీరు కనికరించందే ఒక పూట గడవని యీ వెధవాయ్ - మిమ్మల్ని వెక్కిరించినట్టు - మీ ధర్మ గుణాన్ని కాలదన్నినట్టు - తగుదునమ్మా అని, తానూ నేటికి ఓ మనిషల్లే తయారై మీ బిచ్చం ఆశించకుండా బ్రతకటం - మీకు తలవంపులు కాదూ! - నేనిలా సుఖంగా ఉంటే - అది మీకు రంపపుకోత కాదూ- భరించగలరా- బ్రతుకగలరా?-

నా ఒక్కడి సుఖం ఏ మొచ్చె-ఇన్ని ప్రాణాలు నిలపడం మేలు కాదూ ?- అందుచేత, అకారణంగా సంప్రాప్తించిన సిరికి-గట్టిగా ఆలోచించి - మోకాలు అడ్డే శాను-మళ్ళీ....మీ తల్లికడుపు చల్లగా-మీ కృపకు పాత్రుణ్ణయినాను - ఇక ఎన్నటికీ మీ దయకు మీరి బ్రతకనని అభయమిస్తున్నాను- ఇక గుండెలమీద చేతులు వేసుకుని హాయిగా నిద్రపొండి!"

—వెంకటపతి ఇలా మనవి చేయడం, కొరడా ఝళిపించినట్టయింది.

ఇదేమిటి - మళ్ళీ వీడు యీ ధోరణిలోకి వచ్చాడు - ఆవిడకు మొగం మొత్తి - వీడిని తన్ని తగిలేసిందా? లేకపోతే - యీ వెర్రివాడే అన్నంతపనీ చేశాడా? ఇద్దరు వెర్రివాళ్ళూ ఎవళ్ళకి వాళ్ళే తెప్పరిల్లి కళ్ళు తెరిచి, చూసు కున్నారా? అసలు ఎలా కలుసుకున్నారో, - ఎందుకు విడిపోయినారో....వీడి చేత పలికించడం ఎలా;-

"—ఏంరా, మరి?-"

తెప్పరిల్లి, పలుకరిద్దామనుకుంటూండగనే—వాడు ఎటో మాయమైనాడు-

కాని—ఎక్కడికి పోతాడు?- వాడు చెప్పిన మాటే నిజమయితే మళ్ళీ మన పాల పడ్డట్టే కదా? - ఇక....ఇప్పు డెక్కడికి పోతాడు?- మొరాయింపుకైనా, ఎన్నా ళ్ళని పస్తు వుంటాడు?- అదేకదూ మనధైర్యం-!